

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి.  అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకీ, బాధలకీ, దుఃఖాలకీ నా బాధ్యత లేదు.

## 63
## లాటరీ

**శివం పండిట్** పదిహేనేళ్ళు ఇండియాలో పెరిగాక తండ్రికి అమెరికాలో ఉద్యోగం వస్తే చికాగోలో తేలాడు. హైస్కూల్లో మొదట్లో అతి కష్టం అయింది కొత్త స్నేహితులని కలుసుకోవడం. భాష అడ్డంకి కావడం అనేవాటితో. కానీ పిల్లలకి అటువంటివి సర్వసాధారణం ఊరు, దేశం మారినప్పుడు. పెద్దవాళ్ళు ఎప్పటికీ కొన్నింటికి సర్దుకోలేరు కానీ పిల్లలు సర్దుకోగలరు. అందులోనూ మన దేశీయ కుర్రాళ్ళు చదువులో ముందుంటారు కనకా, చికాగోలాంటి చోట అనేకమంది దేశీయులున్నారు కనకా శివం ఈజీగా సర్దుకున్నాడు. హైస్కూల్లో సీనియర్ గా ఉన్నప్పుడు పరిచయమైంది కేథరీన్ లేదా కేటీ. అదృష్టమో దురదృష్టమో శివం, తండ్రి ఎంత పోరినా ఇంజినీరింగూ, మెడికల్ కాలేజీలకి ఇష్టం చూపించలేదు. ఎకౌంటింగ్ లో డిగ్రీ చేస్తాట్ట. "అయినా ప్రతీ ఇండియన్ ఇంజినీరింగ్ లేదా మెడిసిన్ ఎందుకు చదవాలి?" అని శివం వేసిన ప్రశ్నకి తల్లీ తండ్రీ చెప్పిన సమాధానం కుర్రాడికి నచ్చలేదు. కేటీ మాత్రం ఊరుకుందా? "నీ ఇష్టం వచ్చిన కోర్స్ చేయి; తల్లీ తండ్రీ ఏం చెప్పినా పట్టించుకోకు" అని పురి ఎక్కించింది. అమెరికా తెల్ల పిల్లా, మజాకా?

నాలుగేళ్ళ డిగ్రీ తర్వాత ఎనభై వేల డాలర్ల చదువు అప్పూ, ఏం చేయాలా అనే ప్రశ్నా ఎదురుగా వచ్చాక తల్లీ తండ్రీ చెప్పినట్టు వింటే బాగుండేదేమో అనే శంక ఉదయించినా రెండునెలల్లో ఓ ఉద్యోగం సంపాదించాడు. వెంటనే జరగవల్సిన కార్యక్రమం కేటీ నిర్ణయించింది. పెళ్ళి చేసుకుని వేరు కాపురం పెట్టాలి. తల్లీ తండ్రీలకి ఏమి చెప్పాలో పాలుపోలేదు కానీ తండ్రి ఆలోచించి చెప్పాడు –

"మన ఆహారపు అలవాట్లు, మన ఆచారాలు వేరు. కేటీ మొదట్లో ఒప్పుకున్నా రెండూ, మూడేళ్లలో మనఃస్పర్ధలు రావొచ్చు. చాలా జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి."

ఇరవై మూడేళ్ళ చలాకీ గుర్రం మనసు ఉన్న కుర్రాడికి ఈ ముసలివాసన వేసే ఆలోచనలు నచ్చలేదు. కేటీతో చెప్తే ఆవిడ ఇవన్నీ తీసిపారేసింది. తాను ఆహారపు అలవాట్లు మార్చుకుంటుందిట. హిందువుగా కూడా మారడానికి సిద్ధం. అటువైపు అమెరికన్ వియ్యపురాలు కూడా వీళ్ళ అలవాట్లకీ మార్పులకీ తనకేం సంబంధం లేదనీ ఎవరి ఇష్టం వారిదనీ చెప్పారు. వియ్యంకుడి ప్రసక్తి లేదు ఎందుకంటే కేటీ పుట్టిన నాలుగేళ్లకి ఆయన విడాకులిచ్చి కాలిఫోర్నియా వెళ్ళారు; మరెప్పుడూ ఈ చలి ప్రాంతమైన చికాగో రాకుండా ఉండడానికి. ఆయనకి కేటీ ఎలా ఉన్నా పట్టదు. పెళ్ళికి వస్తాడో రాడో కూడా తెలియదు. ఎంతైనా శివం పండిట్ దేశీ కనక తల్లీ తండ్రీ మొత్తానికి వప్పుకున్నా ఓ షరతు పెట్టారు. పెళ్ళి హిందూ సంప్రదాయంగా గుళ్ళో చేసి తీరాలి, ముందో వెనకో అమెరికా సంప్రదాయంగా చర్చ్ లో చేసినా సరే. దీనికి రెండు పార్టీలూ వప్పుకున్నై.

చర్చ్ లో పెళ్ళి అతి సింపుల్ విషయం. ఓ కాయితం పట్టుకుని, అక్కడ పాస్టర్ గారు చెప్పిన విషయాలకి 'ఐ డూ' అనేసి ఖరీదైన గౌన్ లో వచ్చిన కేటీ మొహం మీద ముసుగు తీసేసి ముద్దెట్టుకోవడమే. ఆ ముద్దులు ఇంతకు ముందెన్ని ఇచ్చినా ఇప్పుడు అందరిముందూ అధికారికంగా ఇవ్వడం వేరు కదా? ఆ తర్వాత కేకు కత్తిరించుటా, 'ఇప్పుడే పెళ్ళైంది' అనే స్టిక్కర్, పెద్ద పూలదండలో ఉన్న కార్లో జామ్మని వెళ్ళిపోవడం. అయితే మన వెంకటేశ్వరుడి గుడిలో గౌన్లూ, ముసుగు ఎత్తి ముద్దులూ, 'ఐ డూ' లు పనికిరావు. సరిగ్గా శాస్త్రం లో చెప్పినట్టూ చేసుకోకపోతే వడ్డీకాసులవాడు చాచిపెట్టి కొట్టగలడు – అప్పుడు పడే శిక్ష ఆయన పేరు ప్రకారం వడ్డీతో సహా భరించుకోవాల్సి ఉంటుంది. అలా కోరుకున్న, నచ్చిన, వీలైన తేదీలో ముహూర్తం నిర్ణయించబడింది.

అప్పటికే అమెరికన్ లా ప్రకారం పెళ్ళైపోయింది కనకా, కేటీగారికి ఆల్రడీ మొగుడిమీద అధికారం సంప్రాప్తమైంది కనకా ఇప్పుడావిడ ఆదేశాల ప్రకారం జీవితం నడవాలి, నడుస్తుంది కూడా. పెళ్ళికి మొదట్లో విఘ్నేశ్వర పూజ, పెళ్ళికూతుర్ని చేయడం, పీటలమీద కూర్చోబెట్టి తలమీద జీలకర్రా బెల్లం పెట్టడం అవీ జరుగుతూ ఉంటే తను పొద్దున్నే షాంపూతో స్నానంచేసిన సుందరమైన జుట్టు తగలబడిపోతోందని ఆవిడ గోల. "ఎందుకిదంతా చేయాలి, దీని అర్ధం ఏమిటి?" అనే ప్రశ్నలకి వెంటనే సమాధానం లేదు. "తర్వాత చెప్తారు తల్లీ.. ప్రస్తుతం ఊరుకో" అని ఎవరెంత చెప్పినా

ఆవిడకి నచ్చలేదు. ఎప్పుడు కట్టుకోని పట్టుచీర కాళ్లకి అడ్డం పడుతూ, సంప్రదాయపు జాకెట్టూ అవీ ఆవిడ ఫ్రీగా కదలడానికి లేకుండా చేసాయి. ఈ లోపుల పురోహితుడొచ్చి పీటలమీద కూర్చోమని పిలిచాడు. ఇంతవరకూ ఓర్చుకున్న కేటీ ఇంక ఆపుకోలేక ఏడుపు లంకించుకుని తల్లి దగ్గిర ఉంటే ఆవిణ్ణి హత్తుకుని ఏడవడం మొదలుపెట్టింది – "ఇవన్నీ ఏమిటి, ఎందుకు చేయాలి, ఎవరూ చెప్పరేం?" అంటూ. వియ్యపురాలికి కూడా కోపం వచ్చి 'వీళ్ళ సంగతి నేను చూస్తా తర్వాత' అని అరిచింది. పురోహితుడికి ఏం చెప్పాలో తెలియలేదు. శివం ఏదో చెప్పాలని ప్రయత్నం చేసాడు, తల్లీ తండ్రీ "అన్నీ తర్వాత వివరంగా చెప్తాం ఇప్పుడు ముహూర్తం మించిపోతోంది" అన్నా ఆవిడ ఏడుపు ఆపలేదు. మొత్తానికి పెళ్ళి అయిందనిపించారు. ఈ తతంగం అయ్యేసరికి కేటీ నిర్ణయించుకున్నదేమంటే – ఈ హిందూమతాన్ని తాను ఏనాటికీ వప్పుకోదు. పెళ్ళైపోయింది కనక శివం తనచేతుల్లో ఆటబొమ్మలా తాను చెప్పింది చేసి తీరాలి లేదా పెటాకులదారి దాకా వస్తే ఎక్కువ నష్టపోయేది శివం గానీ తాను కాదు.

ఏడాది గడిచేసరికి కొత్త దంపతుల వేడి తగ్గాక అప్పుడు అసలు విషయాలు బాగా తెలిసొచ్చాయి ఇద్దరికీ. శివం కి వచ్చే జీతం ఇద్దరికీ సరిపోదు చికాగోలో. కేటీ చదువుకున్నహిస్టరీ డిగ్రీకి ఆవిడకేం పెద్ద ఉద్యోగం రాదు; ఆవిడకి ఉద్యోగం చేయాలన్నా ఏమీ ఇష్టం లేదు. తాను ఇంట్లో ఉండి ఇంటి సంగతి చూస్తుంది. ఇంక చేసేదేంలేదు కనక శివం ఉన్నంతలో సర్దుకోవడం మొదలుపెట్టాడు. వియ్యపురాలు వస్తూ పోతూ ఉంటుంది. చదువుకోసం చేసిన అప్పు కూడా పెరిగి ఇప్పటికి లక్ష డాలర్లు అయింది ఎప్పటికప్పుడు వాయిదాలు కడుతున్నా. నువ్వు ఉద్యోగం చేస్తే బాగుణ్ణని ఈయనా, నోరుమూసుకో అని ఆవిడా అనే గిల్లికజ్జాలు పెరుగుతున్నాయి. ఇండియన్ భోజనం అలవాటైన శివం తనకి కావాల్సింది వండుకోవాలి. కేటీ గారికి అది రాదూ, నేర్చుకోరూ. లేదా శివం ఆవిడ పెట్టే సలాడ్, బర్గర్, పిజా లాంటివి తిని నోరుమూసుకోవడమే. ఇటువంటి రోజుల్లో ఓ రోజు గ్రోసరీ షాపులోంచి బయటకి వస్తూ సరదాకి ఓ లాటరీ టికెట్ కొన్నాడు శివం. ఆ పై వారానికి గుర్తొచ్చి టికెట్ తీసి చూశాడు. ఓహో, తనకి ఏడువందల ఏభై వేల డాలర్లకి లేదా ముప్పాతిక మిలియన్ డాలర్లకి అదృష్టం వరించింది. కథ ఇక్కడే అసలు మలుపు తిరిగింది.

టేక్సు లు పోయాక మిగిలిన లాటరీ డబ్బులు బేంక్ లో వేస్తున్నప్పుడు బేంక్ వారి సలహా ప్రకారం బెనిఫిషరీ గా కేటీ ని పెట్టాడు. వాళ్ళ భాషలో 'మీకు ఏదైనా అయితే బెనిఫిషరీ కి డబ్బులిస్తారు.' శివం చదువుకి తీసుకున్న అప్పు కడుతుంటే కేటీ ఎదురుతిరిగింది, కట్టవద్దనీ, వాళ్ళకి కావాల్సినది ఇంటెరెస్ట్ కట్టడం. అది ఎప్పటికప్పుడు కడితే వాళ్ళేం అనుకోరు. అందువల్ల మొదటగా ఇరవైవేలు పెట్టి ఒక హవాయి ట్రిప్పూ, మరో యాభై వేలు డౌన్ పేమెంట్ చేసి ఇల్లూ కొన్నాక మరో మూడున్నర లక్షలు మిగిలాయి. అవి అలా ఉంచాలి చేతిలో. కనీసం ఇది కేటీ, ఆవిడ అమ్మగారూ చెప్పిన విషయాలు. శివం తల్లీ, తండ్రీ తాము ఏదైనా సలహా చెప్తే కొడుకూ కోడలూ ఏమనుకుంటారో అనే శంకతో 'మీ ఇష్టం' అనేసారు.

మూడు వారాలకి శివం ఆరోగ్యం దిగజారడం మొదలైంది. కేన్సర్ కాదు కానీ స్పెషలిస్ట్ ల దగ్గిర తెల్సిన విషయం శివం తినే భోజనంలో ఆర్సెనిక్ అనే విషం చేరుతోంది. వెంఠనే తినే తిండి మార్చారు కాని అప్పటికే ఆలస్యం అయింది. ఓ రాత్రి ఆంబులెన్స్ లో హాస్పిటల్ కి తీసుకెళ్ళారు. వెంటిలేటర్ వగైరా వాడారు కానీ అప్పటికీ ఆలస్యం అయి ప్రాణం పోయింది. ఇటువంటి చోట పోలీస్ కేసులు తప్పనిసరిగా మొదలౌతాయి కనక కేటీ, శివం అమ్మా నాన్నా అత్తగారు వీళ్ళందరికీ సమన్లు వెళ్ళినై. వాళ్ళ కంప్యూటర్లూ, ఇల్లూ వెతికారు. ఏమీ దొరకలేదు. ఏదీ తేలనప్పుడు అది అలా ఓపెన్ కేస్ గా వదిలేసారు. వచ్చే ఏడో, మరోసారి ఎప్పుడో పోలీసు డిపార్ట్ మెంట్ వారి వీలు బట్టీ, డబ్బులుంటే మరోసారి తీరిగ్గా కేసు ఫైల్ తీసి చూస్తారు.

రెండేళ్ళు పోయాక కొత్తగా డిటెక్టివ్ గా చేరిన ఆల్బర్ట్ చేతిలోకి వచ్చింది కేసు. ఆయన మరోసారి తిరగతోడితే తెల్సిన విషయాలు ఇవి. కేటీ, ఆవిడ తల్లీ ఇప్పుడు మరో ఇల్లు కొనుక్కుని లాటరీ డబ్బులు, క్రెడిట్ కార్డ్ మీదా, శివం జీవిత భీమా డబ్బులూ విచ్చలవిడిగా ఖర్చుపెడుతున్నారు. ఇంకా పీకితే తెల్సిన విషయాల ప్రకారం వియ్యపురాలు వేసిన పథకం ఇది – కూతురు ఇండియన్ ని పెళ్ళిచేసుకోవడం, హిందూమతంలోకి మారడం నచ్చక. ఆవిడ స్నేహితురాలు (కెమిస్ట్ గా పనిచేస్తోంది.) నుంచి అర్సెనిక్ సంపాదించి శివం తిండిలో, తాగే దాంట్లో కలిపారు కావాలని. కేటీ, ఆవిడ తల్లీ శ్రీకృష్ణ జన్మస్థానంలో తేలడానికి మరో రెండేళ్ళు పడితే కెమిస్ట్ గారికి ఫైన్ పడి లైసెన్స్ ఊడింది. శివం కి "అదృష్టవశాత్తూ" లాటరీలో వచ్చిన డబ్బులు స్టూడెంట్ లోన్ కట్టడానికాక్కానీ, ఆయన అనుభవించడానిక్కానీ పనికిరాలేదు కానీ మొగుణ్ణి చంపేసిన కేటీ, ఆవిడ అమ్మగారూ లాయర్ ఫీజులకీ, కోర్టులచుట్టూ తిరగడానికీ సరిపోయాయి.

నీతి: లాటరీ తగలడం అదృష్టమో కాదో కాలం చెప్తుంది.

Post your comments